# రహదారికి గ్రీన్‌సిగ్నల్

- అశ్వాపురం రైల్వేస్టేషన్ రోడ్డుకు అనుమతులు
- ముమ్మరంగా సాగుతున్న పనులు
- నెరవేరనున్న స్థానికుల ఏళ్లనాటి కల



కొనసాగుతున్న అశ్వాపురం రైల్వేస్టేషన్ రహదారి నిర్మాణ పనులు

**అశ్వాపురం:** అశ్వాపురం రైల్వేస్టేషన్‌కు రహదారి సౌకర్యం కల్పించాలని ఎన్నో ఏళ్లుగా కోరుతున్న ప్రజల కల నెరవేరనుంది. అశ్వాపురం రైల్వేస్టేషన్ రహదారి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. 40 ఏళ్ల క్రితం నుంచి అశ్వాపురం రైల్వేస్టేషన్ ఉన్నా రహదారి సౌకర్యం లేక రైల్వేస్టేషన్ నిరుపయోగంగా మారింది. రైతులు పొలాలకు వెళ్లే మట్టి రహదారే దిక్కు. వర్షాకాలంలో ఆ రహదారిపై అడుగు తీసి అడుగు పెట్టలేం.

మండల కేంద్ర ప్రజలు, భారజల కర్మాగారం అధికారులు, ఉద్యోగులు, మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు రైల్వేస్టేషన్‌కు వెళ్లాలంటే మణుగూరు, కొత్తగూడెం వెళ్తూ వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు. రైల్వేస్టేషన్‌కు రహదారి సౌకర్యం కల్పించాలని ప్రజాప్రతినిధులు, ప్రజలు, భారజల కర్మాగారం ఉద్యోగులు ఎన్నో ఏండ్లుగా కోరుతున్నారు. ఎట్టకేలకు రహదారి కల నెరవేరనుంది. ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు ప్రత్యేక చొరవతో రహదారి నిర్మాణానికి ఎస్టీస్డీఎఫ్ నిధులు రూ.2 కోట్లు మంజూరు అయ్యాయి. ఫిబ్రవరి 21న ఎమ్మెల్యే రేగా కాంతారావు రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

**శరవేగంగా నిర్మాణ పనులు**

మండల కేంద్రంలో తురుములగూడెం నుంచి అశ్వాపురం రైల్వేస్టేషన్ వరకు రహదారి నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. 3.04 కిలోమీటర్ల పొడవున రహదారి నిర్మాణం చేపట్టనున్నారు. రహదారి మట్టి పనులు, సైడ్ బరమ్స్, పైపులతో కల్వర్టుల నిర్మాణ పనులు, డ్రెయినేజీ పనులు కొనసాగుతున్నాయి. రహదారి పొడవున మధ్యలో సుమారు 15 కల్వర్టులు పైపులతో నిర్మించనున్నారు. ఆరు మీటర్ల వెడల్పు రహదారి నిర్మించనున్నారు. రైల్వేస్టేషన్ వద్ద పెద్ద వాగు ఉండటంతో స్లాబ్ కల్వర్టుకు ప్రతిపాదనలు పంపారు. రైల్వేస్టేషన్ తరువాత గొందిగూడెం రోడ్డు వరకు రహదారి నిర్మించనున్నారు. దీంతో అశ్వాపురం రైల్వేస్టేషన్‌కు తురుములగూడెం, గొందిగూడెం రెండు మార్గాల ద్వారా చేరుకోవచ్చు. వర్షాకాలం లోపు రహదారి నిర్మాణ పనులు ఎక్కువ శాతం పూర్తి అయ్యేలా చర్యలు చేపడుతున్నారు.

**రైల్వేస్టేషన్‌కు మార్గం సుగమం**

రహదారి నిర్మాణం పూర్తి అయితే మండల కేంద్ర ప్రజలు, భారజల కర్మాగారం అధికారులు, ఉద్యోగులు, మండలంలోని 24 గ్రామ పంచాయతీల ప్రజలు అశ్వాపురం రైల్వేస్టేషన్‌కు సులువుగా చేరుకోవచ్చు. మణుగూరు, కొత్తగూడెం ప్రాంతాలకు వెళ్లే కష్టాలు తీరుతాయి. అశ్వాపురం రైల్వేస్టేషన్‌కు మండల కేంద్రంలోని తురుములగూడెం నుండి మారుమూల గొందిగూడెం నుంచి రెండు రహదారుల ద్వారా వెళ్లొచ్చు. దీంతో గొందిగూడెం, తుమ్మలచెరువు, మనుబోతులగూడెం గ్రామ పంచాయతీల గిరిజనులు రైల్వేస్టేషన్‌కు సులభంగా చేరుకోవచ్చు.

### ప్రజల చిరకాల కోరిక



అశ్వాపురం రైల్వేస్టేషన్‌కు రహదారి నిర్మించాలని మా ప్రజల చిరకాల కోరిక. రహదారి నిర్మించాలని ఎన్నో ఏళ్లుగా ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, జిల్లా కలెక్టర్లు, ఐటీడీఏ పీఓలకు వినతిపత్రాలు అందజేశాం. ఎమ్మెల్యే రేగా కాంతారావుకు రహదారి సమస్య విన్నవించాం. ఎట్టకేలకు ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేయగా రహదారి పనులు సాగుతున్నాయి. ప్రజల పక్షాన ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు.

– బాణోత్ శారద, సర్పంచ్, అశ్వాపురం

### ఎమ్మెల్యే రేగా చొరవతోనే..



అశ్వాపురం రైల్వేస్టేషన్‌కు రహదారి సౌకర్యం లేక ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఇబ్బంది పడుతూ వచ్చారు. రహదారి లేక రైల్వేస్టేషన్ ప్రజలకు ఉపయోగపడటం లేదు. ఎమ్మెల్యే రేగా కాంతారావు చొరవతో ప్రభుత్వం రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. రహదారి నిర్మాణానికి రేగా కాంతారావు కృషి చేయడం వల్లే ఇది సాధ్యపడింది. మండల కేంద్ర ప్రజల పక్షాన ఆయనకు కృతజ్ఞతలు.

– గద్దల రామకృష్ణ, అశ్వాపురం

### సులభంగా చేరుకోవచ్చు



అశ్వాపురం రైల్వేస్టేషన్‌కు రహదారి సౌకర్యం లేక భారజల కర్మాగారం అధికారులు, ఉద్యోగులు వారి కుటుంబసభ్యులు మణుగూరు, కొత్తగూడెం వెళ్తూ ఇబ్బంది పడుతున్నారు. రహదారి నిర్మాణం కోసం ఎన్నో ఏండ్లుగా విన్నవిస్తున్నాం. ఎట్టకేలకు రహదారి నిర్మాణానికి నిధులు మంజూరై పనులు జరుగుతున్నాయి. రహదారి పూర్తయితే రైల్వేస్టేషన్‌కు సులభంగా చేరుకోవచ్చు.

– పాద్య కేశవరావు, భారజల కర్మాగారం ఉద్యోగ సంఘం అధ్యక్షుడు

## క్లుప్తంగా

### ప్రశాంతంగా పాలిసెట్



పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

**మణుగూరుటౌన్:** మణుగూరు మండల కేంద్రంలో తొలిసారిగా ఏర్పాటు చేసిన పాలిసెట్ పరీక్ష బుధవారం ప్రశాంతంగా ముగిసింది. మణుగూరు కేంద్రంలో పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయడంతో స్థానికంగా పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మణుగూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 285మంది పరీక్షలకు హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 138మంది హజరాయ్యారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా నిర్వహించారు. పరీక్షలకు వచ్చే విద్యార్థులను ముందుగా పూర్తిస్థాయిలో తనిఖీలు చేసి కేంద్రంలోకి అనుమతించారు. పరీక్షలు అత్యంత కట్టుదిట్టంగా ప్రశాంతంగా నిర్వహించినట్లు ఆయా కళాశాల ప్రిన్సిపాళ్లు డాక్టర్ బి.శ్రీనివాస్, ఎస్‌డి.యూసఫ్‌లు తెలిపారు.

### సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

**అన్నపురెడ్డిపల్లి:** మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద ఎంపీపీ సున్నం లలిత అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఇటీవల ప్రకటించిన పదో తరగతి ఫలితాల్లో మండలంలో తక్కువ ఫలితాలు రావడంపై ఎంపీపీ సున్నం లలిత, ప్రజాప్రతినిధులు ఎంఈఓ సత్యనారాయణను వివరణ అడిగారు. ఫలితాలపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ సూచించారు.

### ఆర్‌పీఐని బలపరచండి

**బూర్గంపాడు:** సామాజిక న్యాయం కోసం ప్రజలంతా రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా(ఆర్‌పీఐ)ని బలపరచాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేసుపాక నర్సింహారావు కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా బుధవారం ఆయన బాధ్యతలు తీసుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. డాక్టర్ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించేందుకు కేంద్రమంత్రి శ్రీరాందాస్ హతవలె స్థాపించిన ఆర్‌పీఐని జిల్లాలో బలోపేతం చేసేందుకు కృషిచేస్తానన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దిశెట్టి సామేలుకు కృతజ్ఞతలు తెలిపారు.

### జీలుగు విత్తనాలు సిద్ధం

**మణుగూరురూరల్:** సబ్సిడీపై జీలుగు విత్తనాలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయని మణుగూరు సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు జీలుగు విత్తనాలను అందజేస్తోందన్నారు. సొసైటీ కార్యాలయంలో 167బస్తాలు విక్రయానికి అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. 30 కేజీల బస్తా ధర రూ.2407.50లు కాగా.. సబ్సిడీ రూ.1564.80లు పోను రూ.842.70లకు జీలుగు విత్తనాలను విక్రయించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల రైతులు తమ భూమి పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు వెంట తెచ్చుకుని సొసైటీ కార్యాలయంలో విత్తనాలను కొనుగోలు చేసుకోవచ్చన్నారు.

### అగ్ని ప్రమాద కుటుంబాలకు చేయూత

**దుమ్ముగూడెం:** మండలంలోని పెద్ద కమలాపురం గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో కంగాల నాగరాజు, కంగాల వీరయ్య కుటుంబాలు సర్వం కోల్పోయి ఆర్థికంగా నష్టపోగా.. వారికి భద్రాచలం రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో తూరుబాక గ్రామంలో ఒక్కొక్క కుటుంబానికి 12 వేల రూపాయలు విలువచేసే నిత్యవసర సరుకులు బుధవారం అందచేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్‌ఎల్ కాంతారావు, పి.దేశప్ప, సుధాకర్ రెడ్డి, చావ లక్ష్మీనారాయణ, బి.వెంకట రెడ్డి, పి.రాజారెడ్డి, ఏ.జగదీష్, సిద్దుల మాస్టర్ బోనగాల లింగయ్య, ఎల్ఎంబి సూర్యనారాయణ, గొంది నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### జనసేన పోస్టర్లు ఆవిష్కరణ

**అశ్వారావుపేటరూరల్:** స్థానిక పాత ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జనసేన పోస్టర్లను బుధవారం ఆ పార్టీ అశ్వారావుపేట నియోజకవర్గ కోఆర్డినేటర్ డేగల రామచంద్రరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనసేన పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసుకోవాలని, పోస్టర్లను గడపగడపకు తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ బాధ్యులు ఇస్లావత్ వినోద్, బద్దిరెడ్డి రాజేశ్, లింగిశెట్టి కుమార్ స్వామి, దామెర బాబీ, మల్లికార్జునరావు, బుజ్జి, రవీంద్ర పాల్గొన్నారు.

## కల్తీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండండి



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ అఫ్జల్‌బేగం

**చండ్రుగొండ:** కల్తీ విత్తనాల విషయంలో రైతులు ఉండాలని డీలర్లకు వ్యవసాయశాఖ ఏడీఏ అఫ్జల్ బేగం సూచించారు. మండలకేంద్రం చండ్రుగొండలోని రైతువేదికలో బుధవారం నియోజకవర్గస్థాయి డీలర్లతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏడీఏ అఫ్జల్‌బేగం మాట్లాడుతూ.. కల్తీ విత్తనాలు సరఫరా కాకుండా అధికారులు శాఖ పరంగా చర్యలు తీసుకుంటున్నామని, డీలర్లు సైతం తమవంతు సహకారం అందించాలని అన్నారు. డీలర్లు కల్తీవిత్తనాలు విక్రయించినట్లు తమ దృష్టికి వస్తే విచారణ జరిపి లైసెన్స్‌లు రద్దు చేస్తామన్నారు. మేలైన కొత్త అధిక దిగుబడి, నాణ్యత గల వంగడాలను విక్రయించాలని డీలర్లకు సూచించారు. బయటి వ్యక్తులు వచ్చి బిల్లులు లేకుండా విత్తనాలు విక్రయిస్తే సత్వరమే వ్యవసాయశాఖాధికారులకు సమాచారం ఇవ్వాలని ఈ దిశగా రైతులను అప్రమత్తం చేయాలన్నారు. విత్తనాలకు సంబంధించి బిల్లుబుక్కు, రిజిస్టర్, స్టాక్ వివరాలు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసి ఉంచాలని డీలర్లకు కోరారు. ఈ సమావేశంలో దమ్మపేట, అశ్వరావుపేట, అన్నపురెడ్డిపల్లి, చండ్రుగొండ ఏఓలు చంద్రశేఖర్‌రెడ్డి, నవీన్, అనుష, వినయ్ పాల్గొన్నారు.

## కరువవుతున్న నాణ్యమైన విద్య



సమావేశంలో మాట్లాడుతున్న మండల కార్యదర్శి కొండా చరణ్

**చర్ల:** ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య కరవవుతోందని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా మండల కార్యదర్శి కొండా చరణ్ ఆరోపించారు. బుధవారం చర్లలోని ప్రజాపంథా పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనపై అధికారుల పర్యవేక్షణ కరువవడం, మండలానికి మూడేళ్ల కాలంగా విద్యాశాఖాధికారి లేకపోవడం వల్ల చర్ల మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కనీసం 50 శాతం కూడా ఉత్తీర్ణత రాలేదన్నారు. ఫలితాలు పడిపోవడానికి కారణమైన ఉపాధ్యాయులపై ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని, వచ్చే సంవత్సరం ఫలితాలు మెరుగుపడేందుకు ఇప్పటి నుంచే విద్యాశాఖా ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు పాలెం నాగరాజు, మునిగెల శివ, కృష్ణార్జునరావు, సిమిడి సుజాత తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



కల్యాణలక్ష్మి చెక్కు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ నరసింహారావు

**మణుగూరురూరల్:** మండలంలోని కూనవరం గ్రామపంచాయతీ పరిధిలో కల్యాణలక్ష్మి పథకం కింద మంజూరైన చెక్కులను బుధవారం మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు లబ్దిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....తెలంగాణ రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమానికి, అభివృద్ధికి సీఎం కేసీఆర్, పినపాక నియోజకవర్గ అభివృద్ధికి పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు నిరంతరం పాటుపడుతున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఏనిక ప్రసాద్, ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్ఏ భాగ్యలక్ష్మి, ఎంపీటీసీలు గుడిపూడి కోటేశ్వరరావు, తాటి సరిత, మచ్చ సమ్మక్క, ఏఎంసీ డైరెక్టర్ సకిని బాబురావు, వార్డ్ సభ్యులు మిట్టపల్లి కిరణ్‌కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు ముత్యంబాబు, మహిళా మండల అధ్యక్షురాలు పాకాల రమాదేవి పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మెచ్చా సుడిగాలి పర్యటన



సీసీ రోడ్డు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

**అశ్వారావుపేటరూరల్:** మండలంలోని మొద్దులగూడెం, నారంవారిగూడెం, నారంవారిగూడెం కాలనీ, పాత అల్లిగూడెం, పేరాయిగూడెం, గుర్రాల చెరువు గ్రామాల్లో బుధవారం స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు సుడిగాలి పర్యటన చేశారు. ఆయా గ్రామాల్లో రూ.82లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. నారంవారిగూడెం నుంచి గుర్రాల చెరువు గ్రామాల మధ్య రూ.1కోటి 78లక్షల వ్యయంతో నిర్మిస్తున్న బీటీ రహదారి నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించి పనులు సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మొద్దులగూడెం గ్రామంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయించాలని, డ్రెయినేజీ నిర్మాణాలను చేపట్టాలని స్థానికులు కోరారు. నారంవారిగూడెం కాలనీ గ్రామంలో పేదలకు ఇంటి పట్టాలు ఇప్పించాలని, పాత అల్లిగూడెం లోవొల్టేజీ సమస్య ఉందని, దీనిని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, వైస్ ఎంపీపీ చిట్టూరి ఫణీంద్ర, జెడ్పీటీసీ సభ్యురాలు సీహెచ్ వరలక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఆర్ ఏఈ శ్రీధర్, బీఆర్ఎస్ నాయకులు మందపాటి మోహన్‌రెడ్డి, కాసాని మురళి, గుడవర్తి వెంకటేశ్వరరావు, మోటూరి మోహన్, శ్రీను పాల్గొన్నారు.

### ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

**మణుగూరురూరల్:** ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమించినా, అక్రమ నిర్మాణాలు చేపట్టినా చట్టరీత్యా తగు చర్యలు తీసుకుంటామని మణుగూరు మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. మండలంలోని సాయిబాబానగర్ ప్రాంతంలో సర్వే నెంబర్ 138లో చిరువ్యాపారుల జోన్ నిర్మాణం కోసం కేటాయించిన 27గుంటల ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తూ చేపట్టిన కట్టడాలను బుధవారం ఆయన తొలగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అక్రమ కట్టడాలను కూల్చివేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

### న్యూట్రిషన్ కిట్లు పంపిణీ

**పినపాక:** మండలంలోని గర్భిణులకు ప్రభుత్వ వైద్యాధికారిణి దుర్గ భవాని న్యూట్రిషన్ కిట్లను అందజేశారు. మహిళల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ తెలంగాణ ప్రభుత్వం గర్భిణుల కోసం న్యూట్రిషన్ కిట్లు, ప్రసవం అనంతరం కేసీఆర్ కిట్లు అందజేస్తోందన్నారు. న్యూట్రిషన్ కిట్లలో అరకేజీ నెయ్యి, కిలో ఖర్జూర పండ్లు, రెండు హార్లిక్స్ బాటిళ్లు, ఇతర మందులు అందులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో అదనపు వైద్యురాలు సింధుజ, ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

### కార్మికుల సంక్షేమానికి చర్యలు చేపట్టాలి

**మణుగూరురూరల్:** మణుగూరు ఏరియాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో సింగరేణి కార్మికుల సంక్షేమానికి యాజమాన్యం చర్యలు చేపట్టాలని ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వెలగపల్లి జాన్ డిమాండ్ చేశారు.

పీవీకాలనీలోని యూనియన్ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏరియాలో దగ్గరదగ్గర 50డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నప్పటికీ యాజమాన్యం యాజమాన్యం కార్మికుల రక్షణకు చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. సమావేశంలో ఐఎన్‌టీయూసీ నాయకులు టి.పెదనాగయ్య, బి.రాజలింగు, కృష్ణచైతన్య పాల్గొన్నారు.

### ఆటో యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక

**బూర్గంపాడు:** మండల కేంద్రం బూర్గంపాడులో ఆటో యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. బుధవారం జరిగిన ఈ ఎన్నికలో అధ్యక్షుడిగా షేక్ సాదిక్‌పాషా, ఉపాధ్యక్షుడిగా షేక్ అన్వర్‌పాషాను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కన్నా శ్రీనివాసరావు, ప్రధానకార్యదర్శిగా పెద్దయాకుబ్, సహాయ కార్యదర్శిగా కేసుపాక సంపత్, ప్రచార కార్యదర్శిగా చిప్పా సాయినిఖిల్, ప్రచార కార్యదర్శిగా షేక్ మైన్, కోశాధికారిగా కోట దారుగాని ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందనలు తెలియజేశారు.

## ఆధార్ కేంద్రం లేక ఇబ్బందులు

**అశ్వాపురం:** మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం లేక మండల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో, ఎంపీడీఓ కార్యాలయంలో రెండు ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. రెండు కేంద్రాల వల్ల మండలంలోని 24 గ్రామపంచాయతీల ప్రజలు ఆధార్ కార్డు సేవలు సులువుగా పొందారు. గత కొన్ని రోజులుగా అధికారులు రెండు కేంద్రాలు రద్దు చేయడంతో మండలంలో ఆధార్ కేంద్రం లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రతి వ్యక్తికీ ఆధార్ తప్పనిసరి కావడం, ప్రభుత్వ పథకాలకు ఆధార్‌కు ఫోన్ నంబర్ లింకై ఉండాల్సి ఉండటంతో ఆధార్ సేవలు అందుబాటులో లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. కొత్తగా ఆధార్‌కార్డు కావాలన్నా, ఆధార్‌కు ఫోన్ నంబర్ లింక్ చేయాలన్న, పేరు, పుట్టినతేదీ, చిరునామా వంటివి మార్చుకోవాలన్నా మండల ప్రజలు మణుగూరు, భద్రాచలం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. అంతదూరం వెళ్లి సేవలు సకాలంలో పూర్తికాకపోతే నిరాశతో వెనుదిరుగుతున్నారు. అధికారులు స్పందించి మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం సేవలు అందుబాటులోకి తేవాలని మండలంలోని ప్రజలు కోరుతున్నారు.

## గవర్నర్‌కు వినతుల వెల్లువ



గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జీఎస్పీ నాయకులు

**భద్రాచలంటౌన్:** తెలంగాణ రాష్ట్ర 11 బీసీ కులాలను ఎస్టీ జాబితాలో కలుపుతూ అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని కోరుతూ భద్రాచలం పర్యటనకు వచ్చిన గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు మంగళవారం ఆదివాసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని గిరిజన అభ్యుదయ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆదివాసీ సంఘాల జేఏసీ జాతీయ కన్వీనర్ చందా లింగయ్య మాట్లాడారు. అసెంబ్లీ తీర్మానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25న గిరిజన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల ముట్టడి, జూన్ మొదటి వారంలో రాష్ట్రపతికి వినతిపత్రం అందజేసే విధంగా కార్యచరణ రూపొందించిన్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాడుగు శ్రీనివాస్, బుచ్చయ్య, లక్ష్మయ్య, ఉపేంద్ర, రంగారెడ్డి, తాటి వెంకటేశ్వర్లు, రామకృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలి**

భద్రాచలం పట్టణంలోని మూడు పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని గోద్వాన సంక్షేమ పరిషత్ (జీఎస్పీ) ఆధ్వర్యంలో భద్రాచలం పర్యటనకు వచ్చిన గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ మాట్లాడుతూ.. షెడ్యూల్ ప్రాంతాల పంచాయతీరాజ్ చట్టం 1996 ప్రకారం భద్రాచలం పట్టణాన్ని మూడు పంచాయతీలుగా విభజిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్ 45 జారీ చేసిందని, కాని కొందరు వలసవాదులు దీనిని వ్యతిరేకిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికలు నిర్వహించేలా రాష్ట్ర ఎన్నిక కమిషన్‌కు సిఫార్సు చేయాలని గవర్నర్‌ను కోరారు.

**ఆస్పత్రి మార్పునకు సహకరిస్తాం..**

**భద్రాచలం:** రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన సేవా కార్యక్రమాల నివేదికను జిల్లా కోఆర్డినేటర్ డా.ఎస్ ఎల్ కాంతారావు నివేదించారు. క్షయ వ్యాధి బాధితులకు జిల్లా ఆర్యవైశ్య మహాసభ, వాసవి క్లబ్‌ల ఆధ్వర్యంలో పౌష్టికాహార కిట్‌లను గవర్నర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా భద్రాచలంతో పాటు నాలుగు రాష్ట్రాల గిరిజనులకు వైద్య సేవలను అందిస్తున్న భద్రాచలం ఏరియా ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా మార్చేందుకు సహకరిస్తానని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. అనంతరం ఇండియన్ మెడికల్ అసోసియేషన్, రెడ్‌క్రాస్ తరుపున గవర్నర్‌ను సత్కరించారు.

## వీవోఏల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎంబి.నర్సారెడ్డి

**భద్రాచలంఅర్బన్:** రాష్ట్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కబెట్టకుండా వీవోఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ పట్టణ కన్వీనర్ ఎంబి.నర్సారెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక అంబేడ్కర్ సెంటర్ వద్ద నిరవధిక నిరాహార దీక్షలు చేస్తున్న వీవోఏల 31వ రోజు దీక్షలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 18 వేల మంది గ్రామ దీపికలు 50 డిగ్రీల ఎండను కూడా లెక్కచేయకుండా నిరాహార దీక్షలు చేస్తుంటే తెలంగాణ ప్రభుత్వం కళ్లు అప్పగించి చూస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ నాయకులు ఎం.నాగరాజు, జి.లక్ష్మణ్, కాపుల దుర్గారావు, అధ్యక్ష కార్యదర్శులు, వెంకటలక్ష్మి, చంద్రలీల, సీతారత్నం, రమాదేవి, జానకి తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన సీఎం కప్ క్రీడా పోటీలు



అశ్వారావుపేటరూరల్: ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్న వ్యవసాయ కళాశాల డీన్, ఎంపీపీ

**అశ్వారావుపేటరూరల్:** స్థానిక వ్యవసాయ కళాశాల క్రీడా మైదనంలో నిర్వహించిన సీఎం కప్ పోటీలు బుధవారం ముగిశాయి. విజేతలకు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ అహ్మద్ హుస్సేన్, ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి ధ్రువీకరణ పత్రాలను అందించి అభినందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సీహెచ్ వరలక్ష్మి, సర్పంచ్ కంగాల గోవింద్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ సీతారామరాజు, ఆర్‌అండ్‌బీ ఏఈఈ రామిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**అన్నపురెడ్డిపల్లి:** సీఎం కప్ క్రీడా పోటీల్లో పాల్గొని, విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ఎంపీపీ సున్నం లలిత సర్టిఫికెట్‌లను అందజేశారు. సీఎం కప్ వాలీబాల్‌లో 5 జట్లు, కబడ్డిలో 5 జట్లు, ఖో–ఖోలో 3 జట్లు, 100, 400 మీటర్ల పరుగు పందెంలో 10 మంది పాల్గొనగా విన్నర్, రన్నర్ జట్ల సభ్యులకు సర్టిఫికేట్‌లను అందజేశారు. మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు జిల్లా స్థాయిలో రాణించాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అన్నపూర్ణ, తహసీల్దార్ భద్రకాళి, ఎంపీఓ షాబ్నా, ఏఓ అనూష, ఎంపీటీసీలు కాకా సీత, సీతామహాలక్ష్మి, కో–ఆప్షన్ సభ్యుడు బుడేన్, సర్పంచులు బోడాపద్మ, సున్న బసవయ్య పాల్గొన్నారు.

**అశ్వాపురం:** మండల పరిధిలోని గొందిగూడెం ఆశ్రమ పాఠశాలలో బుధవారం సీఎం కప్ ముగింపు పోటీలు జరగగా.. విజేతలకు ఎంపీపీ ముత్తినేని సుజాత ప్రశంసపత్రాలు అందజేశారు. జిల్లా స్థాయికి ఎంపికైన మండల క్రీడాకారులను ఎంపీపీ అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వరప్రసాద్, సర్పంచ్ పాయం భద్రమ్మ, ఎంపీటీసీ చిట్టెమ్మ, ఎంపీఓ శ్రీనివాస్, అశ్వాపురం జెడ్పీ స్కూల్ హెచ్‌ఎం శ్రీనివాస్, అశ్వాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి కృష్ణచైతన్య, యూడీసీ పద్మ, సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

**మణుగూరుటౌన్:** మణుగూరు మండలపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీల ముగింపు వేడుకల్లో జెడ్పీటీసీ పోశం నర్సింహారావు పాల్గొని ప్రసంగించారు. క్రీడల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రమౌళి, తహసీల్దార్ నాగరాజు, పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, ఎంఈఓ వీరస్వామి, కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కే జీవీద్‌పాషా, సర్పంచ్‌లు బచ్చల భారతి, కొమరం జంపేశ్వరి, బొగ్గం రజిత, ఏనిక ప్రసాద్, తాటి రామకృష్ణ, కారం ముత్తయ్యలు పాల్గొన్నారు.

**దమ్మపేట:** సీఎం కప్ ఆటల పోటీల్లో గెలుపొందిన టీంలకు నగదు బహుమతులు, షీల్డ్‌లను అందజేశారు. సీఎం కప్ క్రీడ పోటీలు బుధవారం ముగియగా జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రథమ స్థానంలో గెలుపొందిన వారికి రూ.10,116, ద్వితీయ స్థానంలో గెలుపొందిన వారికి రూ.7,116ల నగదుతో పాటుగా షీల్డ్‌లను అందజేశారు. మండల స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సోయం ప్రసాద్, వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, దారా యుగంధర్, సర్పంచ్‌లు, ఎంపీడీఓ నాగేశ్వరరావు, తహసీల్దార్ స్వామి, ఎంపీడీఓ రామారావు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

**దుమ్ముగూడెం:** మండలంలోని ఆర్లగూడెం బాలుర ఆశ్రమ పాఠశాల ఆవరణలోని క్రీడామైదానంలో నిర్వహిస్తున్న మండల స్థాయి సీఎం కప్ క్రీడాపోటీలు బుధవారం ముగిశాయి. ఫైనల్ పోటీలో విజేతలుగా నిలిచిన జట్లకు మెరిట్ సర్టిపికెట్‌లతో పాటు పార్టిసిపికేషన్ సర్టిఫికెట్‌లను అందచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రేసు లక్ష్మి, జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, ఎంపీడీఓ ముత్యాలరావు, యంఈఓ సున్నం సమ్మయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఈటీలు, పీడీలు తదితరులు పాల్గొన్నారు.

**చండ్రుగొండ:** ప్రభుత్వం మండలస్థాయిలో నిర్వహించిన సీఎం కప్ క్రీడాపోటీలు బుధవారం ముగిసాయి. విజేతలుగా నిలిచిన జట్లకు అవార్డుల తోపాటు ప్రశంసాపత్రాలను అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ బాణోత్ పార్వతి, ఎంపీడీఓ జిరేవతి, తహసీల్దార్ రవికుమార్, ఎంఈఓ సత్యనారాయణ, ఎంపీఓ తోట తులసీరాం, కోఆప్షన్‌సభ్యుడు ఎస్డీ రసూల్, పొంగులేటివర్గం నాయకులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, భోజ్యానాయక్, సారేపల్లి శేఖర్, కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.